Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only.
To know more, please visit: www.freegurukul.org

# పర్యావరణ ప్రమాద ఘంటిక

పర్యావరణ విధ్వంసం వల్ల ఉష్ణోగ్రతలు ఇలాగే పెరుగుతూ పోతూ ఉంటే ప్రపంచంలోని సగం గ్లేసియర్లు (హిమానీ నదాలు) 2100 నాటికి అంతరించిపోయే ప్రమాదం ఉందని తాజాగా వెలువడ్డ అధ్యయనం చేస్తున్న హెచ్చరికలు మానవాళి మనుగడకు పొంచి ఉన్న ప్రమాదాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. సహజసిద్ధంగా ఏర్పడి, మానవాళి మనుగడలో వారసత్వ సంపదగా తరతరాలుగా నిలిచిన ఖుంబు వంటి హిమాలయల్లోని హిమానీ నదాలు కూడా మరో ఎనభై ఏళ్లలో కనుమరుగైపోవచ్చునని ఈ నివేదిక చెబుతోంది.

యూరప్‌లోని స్విస్ ఆల్ప్స్ పర్వత మాలికల్లోని గ్రోసర్ అలెష్ చ్ గ్రెషర్ హిమానీ నదం, గ్రీన్ లాండ్ లోని జాకబ్ షావ్న్ ఇస్ బ్రే వంటి హిమానీ నదాలకు కూడా ముప్పు పొంచి ఉందని నివేదిక చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా గ్లేసియర్ల కదలికలు, అవి కరుగుతున్న వేగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పకృతి పరిరక్షణపై ఏర్పాటైన అంతర్జాతీయ యూనియన్ (ఐయూ సీ ఎన్) ఈ నివేదికను రూపొందించింది. కంప్యూటర్ మోడలింగ్ ఆధారంగా కూడా అధ్యయనాలను నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం ఇంధన కాలుష్యం, కర్బన ఉద్గారాల వల్ల 46 ప్రపంచ వారసత్వ సంపదలైన గ్లేసియర్లలో 21 గ్లేసియర్లు అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఈ అధ్యయనం ప్రకారం 2017 నాటి లెక్కల ప్రకారం ప్రపంచంలో ఉన్న మొత్తం హిమానీ నదాల్లో 33 నుంచి 60 శాతం వరకూ అంతరించిపోతాయని ఈ నివేదిక పర్యావరణ ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. దీని వల్ల వాతావరణ మార్పులు, సముద్ర మట్టం పెరుగుదల, ఫలితంగా పలు ద్వీప దేశాలు సముద్ర గర్భంలో కలిసిపోవడం వంటివి సంభవించే అవకాశం ఉంది. కాబట్టి ప్రపంచ దేశాలు పర్యావరణ కాలుష్యాన్ని, ఇంధన, కర్బన ఉద్గారాలను నియంత్రించే దిశగా కృతసంకల్పంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉదాహరణకు దక్షిణ అమెరికన్ దేశం అర్జెంటీనాలో నేషనల్ గ్లేషిర్స్ పార్క్‌లో ప్రపంచంలోని అతి పెద్దవైన పలు గ్లేషియర్స్ ఉన్నాయి. దీనిలో అరవై శాతం గ్లేసియర్లు కరిగిపోయే పరిస్థితులు ఉన్నాయని అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. ఈ కరిగిన హిమానీ నదాల వల్ల ఈ ప్రాంతంలో పలు వాతావరణ మార్పులు సంభవించే అవకాశం ఉంది. 2100 నాటికి పరిస్థితులు భయావహంగా తయారయ్యే పరిస్థితులు ఉన్నాయని ఈ నివేదిక హెచ్చరిస్తోంది. సుప్రసిద్ధ చారిత్రిక గ్లేసియర్లు ఉన్న వాటర్ టన్ ఇంటర్నేషనల్ పీస్ పార్కు, కెనడియన్ మౌంటెన్ పార్కులు, ఒలింపిక్ నేషనల్ పార్కులలో ఉన్న హిమానీ నదాలలోనూ 70 శాతం హిమఖండాలు కరిగిపోయే అవకాశాలున్నాయి. దీని ఫలితంగా ఇక్కడి వాతావరణంలో ప్రమాదకరమైన మార్పులు చోటుచేసుకుంటాయని నివేదిక హెచ్చరిస్తోంది. 2040 నాటికే యూరప్‌లోని మాంట్ పెర్డూ హెరిటేజ్ గ్లేసియర్ కరిగిపోవచ్చునని హెచ్చరికలు వెలువడుతున్నాయి.

మరో వైపు సముద్ర జలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చి చేరడం వంటి సమస్యల ఫలితంగా సాగర జలాల నుంచి కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి సముద్ర మట్టాలు పెరిగితే సముద్ర జీవ జంతుజాలాలతో పాటు, సముద్ర ద్వీపాలలో నివసించే జనానీకం కూడా ఎన్నో కఠిన పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుంది. మాల్దీవ్స్, మారిషస్ వంటి దేశాలు ముంపునకు గురి కావలసి వస్తుంది. బంగ్లాదేశ్ వంటి చోట్ల సముద్ర జలాలు లోపలికి చొచ్చుకువచ్చి, ఆవాసాలను నివాసానికి అయోగ్యంగా చేసేస్తాయి.

మానవాళికి ఇలాంటి అధ్యయనాలు హెచ్చరికల వంటివి. కర్బన సైకిల్స్ విషయంలో, ఇతర ప్రకృతి ప్రమాదాల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి, విపత్తును ఎదుర్కొనడానికి సావకాశం లభిస్తుంది. ఈ దిశగా ఈ అధ్యయనానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రకృతి మార్పుల వల్లే, హఠాత్తుగా సంభవించిన వరదలు, తత్ఫలితంగా కలిగిన ముంపు వల్లే సింధు నది నాగరికతలో అంతర్భాగాలైన హరప్పా, మొహంజదారో వంటి నగరాలు అంతరించిపోయాయన్నది మనకు చరిత్ర చెబుతున్న సత్యం. మానవ జోక్యం వల్ల కలిగే ప్రకృతి విపత్తుల వల్ల మానవాళి సహజ జీవన శైలికూడా ప్రభావితం అవుతుంది. సమాజిక వ్యవస్థలు ప్రభావితం అవుతాయి. ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోతాయి. కాబట్టి ఈ తాజా అధ్యయనం చేస్తున్న హెచ్చరికలను ప్రభుత్వాలు, స్వచ్ఛందసంస్థలు పట్టించుకోవాలి. ఈ విషయాన్ని విస్మరిస్తే పరిస్థితి మరింత దిగజారుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.